
AKSHARA TODAY

అక్షర టుడే

TOWARDS... TRUTH. TRUST. TREND

www.aksharatoday.in


**తాళం వేసిన ఇంట్లో బంగారం చోరీ**



2



2

**అథర్వణ వేద పారాయణం**

## ఓట్ల లెక్కింపు.. పటిష్ట బందోబస్తు: ఎస్పీ

**అక్షరటుడే, కామారెడ్డి:** జిల్లాలో మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా కౌంటింగ్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్టు జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర తెలిపారు. లెక్కింపు కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛ నీయ సంఘటనలు జరగకుండా భారీ బందోబస్తుతో పాటు క్యూఆర్టీ, డాగ్ స్క్వాడ్, బాంబ్ డిస్పోజల్, స్ట్రైకింగ్ ఫోర్స్ టీములను సిద్ధంగా ఉంచినట్లు పేర్కొన్నారు. కౌంటింగ్ కేంద్రాల పరిసరాల్లో 163 బీఎన్ఎస్ఎస్ సెక్షన్ అమలులో ఉంటుందని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఫలితాల వెల్లడి అనంతరం విజయోత్సవ ర్యాలీలు, బైక్ ర్యాలీలు, డీజేలు ఏర్పాటు చేయడం, బాణసంచా కాల్చడంపై పూర్తి నిషేధమని ఎస్పీ స్పష్టం చేశారు.



పురపోరు ముగిసింది. ఓటర్లు తమ తీర్పును బ్యాలెట్ బాక్సుల్లో నిక్షిప్తం చేశారు. గెలుపు ఎవరిదో మరికొన్ని గంటల్లో తేలనుంది. దీంతో అభ్యర్థులు ఉత్కంఠతో నిరిక్షిస్తున్నారు. బయటకు తామే గెలుస్తామని ధీమా వ్యక్తం చేస్తున్నా.. లోపల ఆందోళన చెందుతున్నారు. ఏ వార్డులో తమకు ఎన్ని ఓట్లు పడ్డాయోనని లెక్కలు వేసుకుంటున్నారు. మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్ శుక్రవారం చేపట్టనున్నారు. ఈ మేరకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.

- అక్షరటుడే, ఇందూరు, కామారెడ్డి



# గెలుపెవరిదో!

- **బ్యాలెట్ బాక్సుల్లో అభ్యర్థుల భవితవ్యం**
- **రేపు మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్**
- **ఏ పార్టీకి మెజారిటీ వస్తుందోనన్న ఉత్కంఠ**
- **ఓటర్ల లెక్కలేసుకుంటున్న అభ్యర్థులు**

ఉమ్మడి జిల్లాలో మున్సిపల్ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. అధికారుల ఏర్పాట్లు, పోలీసు శాఖ పకడ్బందీ బందోబస్తు మధ్య అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎన్నికలు సాగాయి. శుక్రవారం ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ సైతం సాఫీగా సాగేలా అధికారులు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో నిజామాబాద్ కార్పొరేషన్‌తో పాటు బోధన్, ఆర్మూర్, భీమ్‌గల్, కామారెడ్డి, బాన్సువాడ, ఎల్లారెడ్డి, బిచ్కుంద మున్సిపాలిటీలకు ఎన్నికలు జరిగాయి. మొత్తం 60 డివిజన్లు, 178 వార్డులలో ఎన్నికలు జరగ్గా.. నిజామాబాద్ జిల్లాలో 714 మంది, కామారెడ్డి జిల్లాలో 447 మంది ఎన్నికల బరిలో నిలిచారు.

### కొన్ని గంటల్లో..

నిజామాబాద్ జిల్లాలో 488 పోలింగ్ కేంద్రాలలో 3,06,697 మంది, కామారెడ్డి జిల్లాలో 239 పోలింగ్ కేంద్రాలలో 1,03,895 మంది ఓటు వేశారు. ఎన్నికల అనంతరం బ్యాలెట్ బాక్సులను సీజ్ చేసిన అధికారులు వాటిని కౌంటింగ్ కేంద్రాలకు తరలించారు. ఓటరు నిర్ణయం, అభ్యర్థుల భవిష్యత్తు బ్యాలెట్ బాక్సులలో నిక్షిప్తమైంది. దాంతో అభ్యర్థుల్లో ఆందోళన నెలకొంది. శుక్రవారం సాయంత్రం 4 గంటల తుది ఫలితాలు వెల్లడయ్యే అవకాశం ఉంది. అన్ని పార్టీలు మున్సిపల్ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. గెలుపే లక్ష్యంగా అభ్యర్థులతో పాటు కీలక నేతలు ప్రచారం చేశారు. ఈ క్రమంలో ఓటరు ఎవరివైపు నిలిచాడనేది కొద్ది గంటల్లో తేలనుంది. అభ్యర్థులు మాత్రం తమకు ఎవరెవరు ఓటేసి ఉంటారని లెక్కలు వేసుకుంటున్నారు. చేసిన ఖర్చుల లెక్కలు సైతం రాసుకుంటున్నారు. ఒకవేళ ఓటమి పాలైతే తమ పరిస్థితి ఏమిటని ఆందోళనకు గురవుతున్నారు.



ఎల్లారెడ్డిలో..



కామారెడ్డిలో..

### ఏర్పాట్లు పూర్తి

కౌంటింగ్ కోసం అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. కామారెడ్డి జిల్లా పోలీసు కార్యాలయ సమీపంలో గల ఏఎంసీ గోదాంలో కౌంటింగ్ చేపట్టనున్నారు. 32 టేబుళ్లు, 114 మంది సిబ్బందిని ఏర్పాటు చేయగా రెండు రౌండ్లలో ఫలితాలు వెల్లడించనున్నారు. బాన్సువాడలో ఎస్.ఆర్.ఎన్.కే కళాశాలలో 19 టేబుళ్లు ఏర్పాటు చేశారు. ఒకే రౌండ్‌లో ఫలితాలు వెల్లడించనున్నారు. ఎల్లారెడ్డిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 12 టేబుళ్లు, బిచ్కుందలో 10 టేబుళ్లు ఏర్పాటు చేశారు.

### నిజామాబాద్ జిల్లాలో..

నిజామాబాద్ కార్పొరేషన్‌కు సంబంధించి ఓట్ల లెక్కింపు జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించనున్నారు. ఇందుకోసం 60 టేబుళ్లు 230 మంది సిబ్బందిని నియమించారు. బోధన్ మున్సిపాలిటీకి సంబంధించి విజయ్ మేరీ పాఠశాలలో లెక్కింపు జరగనుంది. ఇందుకోసం 38 టేబుళ్లు ఏర్పాటు చేశారు. ఆర్మూర్‌కు సంబంధించి డిగ్రీ కాలేజీలో కౌంటింగ్ జరగనుంది. 36 టేబుళ్లు, 130 మంది సిబ్బందిని నియమించారు. భీమ్‌గల్‌లో 12 టేబుళ్లను ఏర్పాటు చేశారు. మున్సిపాలిటీల ఫలితాలు మధ్యాహ్నం వరకు తేలనున్నాయి. నిజామాబాద్ కార్పొరేషన్ రిజల్ట్ సాయంత్రానికి తేలే అవకాశం ఉంది.



## అంగరంగవైభవంగా శివపార్వతుల కల్యాణం

**అక్షరటుడే,కోటగిరి :** పోతంగల్ మండలం కారేగాం గుట్టపై వెలిసిన స్వయంభు మహాదేవ ఆలయంలో మొదటి వార్షికోత్సవం సందర్భంగా శివపార్వతుల కల్యాణాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, చండీహోమం పారాయణం, అభిషేకాలు చేశారు. కనకమేడల వెంకటేశ్వరరావు, శ్యాం ప్రసాద్ దంపతుల ఆధ్వర్యంలో శివపార్వతుల కల్యాణాన్ని జరిపించారు. కార్యక్రమంలో భాగంగా నిత్యం, భజనలు, పారాయణం, కీర్తనలు, చిన్నారులతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. భక్తబృందం తరపున అల్పాహారం, మధ్యాహ్నం, సాయంత్రం భోజనాలు ఏర్పాటు చేశామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. శుక్రవారం డాక్టర్ సద్గురు బసవ లింగ అవధూత మహారాజ్ వస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.






## ఎలక్ట్రిసిటీ ప్రైవేట్ బిల్లును నిలిపివేయాలి

**అక్షరటుడే, ఇందూరు:** ఎలక్ట్రిసిటీ ప్రైవేటు బిల్లును కేంద్ర ప్రభుత్వం వెంటనే నిలిపివేయాలని ఎలక్ట్రిసిటీ ఇంజినీర్స్ అండ్ ఎంప్లాయీస్ జిల్లా జేఏసీ ఛైర్మన్ రఘునందన్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని పవర్ హౌస్‌లో గురువారం భోజన విరామ సమయంలో నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యుత్ సంస్థలను ప్రైవేటుపరం చేయవద్దన్నారు. ఈ మేరకు కేంద్రం ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంటే సమ్మెను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఇలాంటి చర్యల వల్ల ఉద్యోగస్తులకు కుటుంబాలు వీధిపాలవుతాయని తక్షణమే విద్యుత్తు అమెండ్‌మెంట్ బిల్‌ను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జేఏసీ కార్యదర్శి పూదరి గంగాధర్, అల్జాపూర్ రమేష్, కో-కన్వీనర్ తోట రాజశేఖర్, జేఏసీ నాయకులు ప్రసాద్ రెడ్డి, రాజేందర్, కాశీనాథ్, సురేష్ కుమార్, గంగారాం నాయక్, చంద్రశేఖర్, శ్రీనివాస్, చాంద్ పాషా, శివాజీ, నగేష్ కుమార్, శ్రీనివాస్, పిరాజీ వెంకట్ ప్రసాద్, మిథున్, రాజేందర్ గౌడ్, వేణుగోపాల్, బీసీ రాజు, వేణు, మొయినుద్దీన్, శివ ప్రసాద్, నరేందర్ నాయక్, రాజేశ్వరి, విజయ, శాంతా కుమారి, పద్మ, సుమారు 300 మంది ఉద్యోగులు ధర్నాలో పాల్గొన్నారు.

## కౌంటింగ్ కేంద్రాల వద్ద నిబంధనలు పాటించాలి : సీపీ సాయి చైతన్య



**అక్షరటుడే, నిజామాబాద్ క్రైం:** నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో శుక్రవారం కౌంటింగ్ కేంద్రాల వద్ద నియమ నిబంధనలు పాటించాలని సీపీ సాయిచైతన్య పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ప్రకటన విడుదల చేశారు. అర్బన్‌కు సంబంధించి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో, బోధన్ విజయమేరి హైస్కూల్‌లో, ఆర్మూర్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో, భీమ్‌గల్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని సీపీ తెలిపారు. నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్‌లో మేయర్, చైర్‌పర్సన్ల ఎన్నికల ప్రక్రియ ఈనెల 16న ఉంటుందన్నారు. కౌంటింగ్ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో కఠిన నిబంధనలు అమలు చేస్తున్నామన్నారు. ఎన్నికల నిబంధనల దృష్ట్యా విజయం సాధించిన అభ్యర్థులు ఊరేగింపు కార్యక్రమాలు నిర్వహించడం పూర్తిగా నిషిద్ధమన్నారు. విజయోత్సవ, బైక్ ర్యాలీ, పటాకులు కాల్చడంపై నిషేధం ఉందన్నారు. ప్రజలకు చిరాకు కలిగించే కార్యక్రమాలు చేయవద్దని సీపీ సూచించారు. ముందస్తు అనుమతి లేకుండా బహిరంగ సమావేశాలు, ఊరేగింపులు నిర్వహించవద్దన్నారు. ఆదేశాలను ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



## ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు పూర్తి

**అక్షరటుడే, ఇందూరు:** జిల్లాలోని మూడు మున్సిపాలిటీలు, నగరపాలక సంస్థ పరిధిలో ఓట్ల లెక్కింపు కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాలలో శుక్రవారం ఏర్పాటుచేసిన శిక్షణా తరగతులను సందర్శించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఓట్ల లెక్కింపు ప్రక్రియ భావోద్వేగాలతో ముడిపడి ఉన్నందున జాగ్రత్తతో బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలన్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనలను తప్పక పాటిస్తూ పూర్తి పారదర్శకంగా ఓట్ల లెక్కింపు జరపాలని సూచించారు. ఎలాంటి సందేహాలున్నా ఉన్నతాధికారులను సంప్రదించి నివృత్తి చేసుకోవాలని చెప్పారు. లెక్కింపు అనంతరం ఫలితాల వెల్లడిలో గందరగోళానికి గురికాకూడదని, ఒకటికి రెండుసార్లు జాగ్రత్తగా పరిశీలించాలని వెల్లడించారు. కౌంటింగ్ హాల్‌లోకి ఆర్వో మినహా ఇతరులు ఎవరికి సెల్‌ఫోన్లు తీసుకెళ్లేందుకు అనుమతి లేదని చెప్పారు. కలెక్టర్ వెంట బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, నిజామాబాద్ ఆర్డీవో రాజేంద్రకుమార్, నగరపాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, బోధన్ మున్సిపల్ కమిషనర్ జాదవ్ కృష్ణ తదితరులున్నారు.

## కౌంటింగ్ సందర్భంగా నగరంలో ట్రాఫిక్ ఆంక్షలు

**అక్షరటుడే, నిజామాబాద్ క్రైం:** మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ సందర్భంగా నగరంలో ట్రాఫిక్ ఆంక్షలు విధించినట్లు సీపీ సాయిచైతన్య తెలిపారు. ఈ మేరకు గురువారం ప్రకటన విడుదల చేశారు. హైదరాబాద్, ఆర్మూర్ నుంచి నిజామాబాద్‌కు వచ్చి వెళ్లే ఆర్టీసీ బస్సులు, ఇతర వాహనాలు బైపాస్ కంఠేశ్వర్, బైపాస్ ఖాజా హోటల్, ఐడీవోసీ, ఖానాపూర్ కాలూర్ జంక్షన్ నుంచి దుబ్బా చౌరస్తాకు చేరుకోవాలి. అక్కడి నుండి శివాజీ విగ్రహం, రైల్వే ఫ్లైఓవర్ గుండా బస్టాండ్ వైపునకు వెళ్లాలి. అలాగే బోధన్, బాన్సువాడ వైపు నుంచి వచ్చే వాహనాల రాకపోకల్లో ఎలాంటి మార్పులు లేవు. ఎన్నికల కౌంటింగ్ జరిగే ప్రాంతమైన పాలిటెక్నిక్ కళాశాల పరిసర ప్రాంతాల్లో పాక్షికంగా ట్రాఫిక్ ఆంక్షలు ఉన్నందున ప్రజలు సహకరించాలని సీపీ సూచించారు. అత్యవసర పరిస్థితిలో వాహనదారులు ఇతర మార్గాలలో ప్రయాణం కొనసాగించాలని సీపీ తెలిపారు. ఆయా ప్రాంతాల్లో ట్రాఫిక్ సిబ్బంది ఉంటారని.. వారికి సహకరించాలని కోరారు.



## మేయర్ పీఠం బీజేపీదే..: ఎమ్మెల్యే ధన్‌పాల్

**అక్షరటుడే, ఇందూరు:** నిజామాబాద్ అర్బన్‌లో మేయర్ పీఠాన్ని బీజేపీ కైవసం చేసుకుంటుందని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, పార్టీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి ధీమా వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బీజేపీ అభ్యర్థులు కౌంటింగ్ ఏజెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇందూరు మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ అఖండ విజయం సాధిస్తుందన్నారు. 'మన ఇందూరు.. మన మేయర్' నినాదంతో ముందుకు వెళ్తున్నామన్నారు. ఈ నినాదాన్ని నగరవాసులు బలంగా విశ్వసించారన్నారు. నగర అభివృద్ధి కేవలం బీజేపీతోనే సాధ్యమవుతుందని ప్రజలు నమ్మారని వారు పేర్కొన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలను ప్రజలు తిరస్కరించారని వ్యాఖ్యానించారు. ఫలితాల రోజు ఆ పార్టీలకు భంగపాటు తప్పదన్నారు. ఏజెంట్లు సమయానికి కౌంటింగ్ కేంద్రానికి చేరుకోవాలని ధన్‌పాల్, దినేష్ సూచించారు. బాక్స్ ఓపెన్ చేసేముందు సీల్స్ సరిగా ఉన్నాయో లేదో పరిశీలించాలన్నారు. ఓట్లు లెక్కించేటప్పుడు ప్రతి ఓటును జాగ్రత్తగా గమనించాలని పేర్కొన్నారు. బీజేపీకి పడిన ఓటును పొరపాటున 'ఇన్ వ్యాలిడ్' కింద వేయకుండా చూసుకోవాలన్నారు. అనుమానం ఉంటే వెంటనే అభ్యంతరం చెప్పాలని వివరించారు. ప్రతి రౌండ్ తర్వాత అధికారుల లెక్కలతో సరిచూసుకోవాలని, కౌంటింగ్‌లో తేడా అనిపిస్తే వెంటనే రీకౌంటింగ్ కోరాలని దిశానిర్దేశం చేశారు. సమావేశంలో నాయకులు రామచందర్, నాగోల్ల లక్ష్మీనారాయణ, ప్రమోద్ కుమార్, తిరుపతిరెడ్డి, బద్దంకిషన్, బంటు రాము, వీరేందర్ పాల్గొన్నారు.

# మహిమాన్వితుడు..

# నాళేశ్వర్ రాజరాజేశ్వరుడు..

**నవీపేట్ మండలంలోని నాళేశ్వర్ గ్రామంలో గోదావరి నది ఒడ్డున ఉన్న రాజరాజేశ్వర ఆలయానికి ఎంతో ప్రాశస్త్యం ఉంది. వందల ఏళ్ల చరిత్ర కలిగిన ఈ ఆలయానికి మహాశివరాత్రి సందర్భంగా భక్తులు పోటెత్తుతారు. ఈ ఆలయాన్ని చోళుల కాలంలో రాజరాజ నరేంద్రుడు నిర్మించినట్లు ప్రతీతి.** – అక్షరటుడే, బోధన్

- మహాశివరాత్రికి ముస్తాబైన నాళేశ్వర్ శివాలయం
- వీడీసీ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా ఏర్పాట్లు
- గ్రామానికి రాజరాజేశ్వరుడే అండగా ఉన్నాడని ప్రగాఢ నమ్మకం

గోదావరి నది తీరంలో ఋషుల తపస్సుతో నాళేశ్వర్ గ్రామ సమీపంలో స్వయంబు లింగం ఉద్భవించిందని పురాణ గాథలు చెబుతున్నాయి. త్రేతాయుగంలో శ్రీరామచంద్రుడు తన వనవాసం సమయంలో గోదావరి తీరంలో ఉన్న ఈ పుణ్యక్షేత్రంలో సాయంసంధ్య వేళలో పూజలు చేసేవాడని పురాణాలు చెబుతున్నాయి. ద్వాపర యుగంలో పాండవులు కూడా ఈ శివలింగాన్ని దర్శించుకున్నారని ఆలయ స్థల పురాణంలో ఉంది. వీరితో పాటు జగద్గురు ఆది శంకరాచార్యులు సైతం ఆలయాన్ని దర్శించుకున్నారని శాస్త్రాలు తెలియజేస్తున్నాయి.



### పంచారామ ఆలయాల్లో ఒకటి..

గోదావరి నది తీరంలో 108 గౌతమ క్షేత్రాలు ఉన్నాయి. బ్రహ్మేశ్వరం (గానగాపూర్) పాపేశ్వరాలయం (బాసర), గౌతమేశ్వరాలయం (బినోల), ఉమామహేశ్వరం (ఉమ్మెడ), రాజరాజేశ్వరాలయం (నాళేశ్వర్) పంచారామాలు వెలిశాయి తెలంగాణలోని ఈ పంచ రామాయణంలో రాజ రాజేశ్వరాలయానికి ప్రాముఖ్యత ఎక్కువని స్థానికులు చెబుతున్నారు.

### కోడె దూడల సమర్పణ..

వేములవాడ మాదిరిగానే ఇక్కడ కోడె దూడలను సమర్పించుకోవడం విశేషం. అందుకే ఆలయం విశిష్టత గుర్తించిన పాతతరం నాటి భక్తులు పెద్ద సంఖ్యలో కుటుంబ సభ్యులతో వచ్చి శివరాత్రి పర్వదినాన తమ మొక్కులు తీర్చుకుం టుంటారు. కోడెదూడలను సమర్పించు కుంటారు. రాత్రికి జాగరణ చేస్తారు.

### మూడురోజుల పాటు వేడుకలు..

మూడు రోజుల పాటు నాళేశ్వర్ రాజరాజేశ్వర ఆలయంలో మహాశివరాత్రి వేడుకలు అంతరంగ వైభవంగా జరుగనున్నాయి. ఈ సందర్భంగా ఆలయానికి వచ్చే వేలాది మంది భక్తుల కోసం గ్రామాభివృద్ధి కమిటీ అన్ని ఏర్పాట్లు చేస్తోంది. భక్తులు ఆలయంలో స్వామిని దర్శించుకునేందుకు ప్రత్యేకంగా క్యూలైన్లు ఏర్పాటు చేస్తోంది. అలాగే భారీగా అన్నదానం చేసేందుకు సైతం ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇప్పటి నుంచే ఏర్పాట్లు చేస్తున్నారు.



### ఊరంతా ఉపవాసం..

నాళేశ్వర్ గ్రామంలో స్వయంబుగా వెలసిన శివాలయం ఉండడంతో ప్రతి సోమవారం ఊరంతా ఉపవాసం ఉంటుంది. కొన్నేళ్లుగా ఈ పద్ధతిని గ్రామస్థులు పాటిస్తున్నారు. ఆ రాజరాజేశ్వరుడే తమ గ్రామాన్ని కాపాడుతున్నాడని గ్రామస్థుల ప్రగాఢ విశ్వాసం. ప్రతి సోమవారం సైతం ఆలయ పరిసరాల్లో పండుగ వాతావరణం నెలకొంటుంది.

## మూడు రోజుల పాటు జాతర



శివరాత్రి సందర్భంగా మూడు రోజులపాటు జాతర ఘనంగా నిర్వహిస్తారు. మహాశివరాత్రి పండుగ రోజు వేదపండితులతో అభిషేకం, పూజా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుంది. వేములవాడ మాదిరిగానే ఇక్కడ కూడా కోడె దూడలను వదిలి భక్తులు మొక్కులు తీర్చుకుంటారు. ప్రతి ఏడాది లాగే ఈ ఏడాది కూడా భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి మొక్కలు తీర్చుకునే అవకాశం ఉంది.

– మగ్గరి హన్మాండ్లు, సొసైటీ మాజీ చైర్మన్ నాళేశ్వర్

## వీడీసీ ఆధ్వర్యంలో ఘనంగా ఏర్పాట్లు



మహాశివరాత్రి పండుగ రోజు సాయంత్రం, షావమూర్తులతో ఊరేగింపుగా మందిరానికి వెళ్లి రాత్రంతా జాగరణ చేస్తారు. మరుసటి రోజు అన్నదాన కార్యక్రమం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుంది. భక్తులు అధిక సంఖ్యలో వస్తారు కాబట్టి భక్తులకు ఎటువంటి ఆసౌకర్యాలు తలెత్తకుండా చూసుకునేందుకు వీడీసీ ఏర్పాట్లు చేస్తోంది.

– తూం లక్ష్మణ్, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యుడు

## ప్రతి సోమవారం ఊరంతా ఉపవాసం..



మహాశివరాత్రి పండుగను నాళేశ్వర్‌లో ప్రతి ఏడాది భక్తిశ్రద్ధలతో జరుపుకుంటాం. గ్రామంలో స్వయంబుగా వెలసిన శివాలయం ఉండడంతో ప్రతి సోమవారం ఊరంతా ఉపవాసం ఉంటుంది. శివరాత్రి రోజు భక్తులు వేములవాడ మాదిరిగా ఇక్కడ కూడా పుట్టిన బిడ్డలకు పుట్టు వెంట్రుకలను తీసుకుంటారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా వీడీసీ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు.

– శ్రీనివాస్, ఉపసర్పంచ్, ఆర్మూర్

## 44 కార్మిక చట్టాలను పునరుద్ధరించాలి



**అక్షరటుడే, బాన్సువాడ:** కేంద్ర ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను వెంటనే పునరుద్ధరించాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు ఎంఎల్ఎస్ పాయింట్ వద్ద సివిల్ సప్లయ్ హమాలీ వర్కర్స్ యూనియన్, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఒకరోజు సమ్మె నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ దుబాస్ రాములు మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మికులు దీర్ఘకాల పోరాటాల ద్వారా సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దు చేయడం సరైంది కాదన్నారు. కార్మిక హక్కులను కాపాడేందుకు రద్దు చేసిన 44 కార్మిక చట్టాలను తిరిగి పునరుద్ధరించాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే లేబర్ కోడ్స్ అమలు నోటిఫికేషన్‌ను వెంటనే ఉపసంహరించుకోవాలని కోరారు. కార్యక్రమంలో గంపల సాయిలు, భూమయ్య, రాపర్తి సాయిలు, ధర్మం చిన్న సాయిలు, సాయిలు పాల్గొన్నారు.

## యూరియా యాప్‌ను తొలగించాలి

**అక్షరటుడే, ఆర్మూర్:** తెలంగాణ ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన యూరియా యాప్‌ను వెంటనే తొలగించాలని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు అల్లూరి గంగారెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ప్రకటన విడుదల చేశారు. కొత్తగా తెచ్చిన రైతు యాప్ ద్వారా రైతులకు ఎరువులు దొరకడం లేదన్నారు. ప్రస్తుతం వరి పంటకు, సజ్జ, కూరగాయల పంటలకు సంబంధించి పెర్కిట్ సొసైటీకి బుధవారం యూరియా బస్తాలు వచ్చినప్పటికీ యాప్ పనిచేయకపోవడంతో అధికారులు యూరియా ఇవ్వలేదన్నారు. ఇప్పటికైనా రైతు యాప్‌ను వెంటనే తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు. ఇది ఒక్క గ్రామ సమస్య కాదని.. రాష్ట్రంలో అన్ని ప్రాంతాల్లో ఉందన్నారు.

## స్నేహితుడి కుటుంబానికి ఆర్థికసాయం



**అక్షరటుడే, బాన్సువాడ:** మూడు రోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో నస్రుల్లాబాద్ మండలం అంకోల్ గ్రామానికి చెందిన పసుపుల సాయి అకాలమరణం చెందడంతో గ్రామంలో విషాదం నెలకొంది. నిరుపేద కుటుంబానికి చెందిన సాయి మరణంతో బాధిత కుటుంబం పెద్ద దిక్కును కోల్పోయి తీవ్రదుఃఖంలో మునిగిపోయింది. స్పందించిన స్థానిక యువత సాయి కుటుంబాన్ని ఆదుకోవాలనే సంకల్పంతో యువత ఏకమయ్యారు. తమ స్నేహితుడి కుటుంబానికి అండగా నిలవాలని నిర్ణయించుకుని గ్రామంలో చందాలు సేకరించారు. మొత్తంగా రూ.63,500 సేకరించి ఆ మొత్తాన్ని గురువారం సాయి కుటుంబ సభ్యులకు అందజేశారు.

## ఘనంగా వశిష్ట విద్యాసంస్థల వార్షికోత్సవం




**అక్షరటుడే, కామారెడ్డి:** వశిష్ట విద్యాసంస్థల 23వ వార్షికోత్సవం సంబరాలు మున్సిపాలిటీ పరిధిలోని దేవునిపల్లి లక్ష్మీదేవి గార్డెన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ రకరకాల సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొని ఆట, పాటలతో అందరిని ఆకట్టుకున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న తెలంగాణ యూనివర్సిటీ పరీక్షల విభాగం అధిపతి ప్రొఫెసర్ సంపత్ కుమార్ విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు చక్కగా చదువుకొని, కళాశాలలో ఉన్న అన్ని సదుపాయాలను ఉపయోగించుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. కళాశాలల సీఈవో హరిస్మరణ్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యతో పాటు నైపుణ్యాలు నేర్చుకొని చక్కటి ఉద్యోగాలను సాధించాలని కోరారు. కార్యక్రమంలో కళాశాలల డైరెక్టర్లు జనార్దన్ రెడ్డి, బాలాజీ రావు, రాజేశ్వర్ రావు, శ్రీనివాస్, శేషారావు, వశిష్ట డిగ్రీ అండ్ పీజీ కళాశాలల ప్రిన్సిపల్ అనిల్ రెడ్డి, వశిష్ట జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ రాజు, కళాశాలల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ నాయకులే పార్టీకి ద్రోహం చేస్తున్నారు..

**అక్షరటుడే, కోటగిరి :** మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో కొందరు కాంగ్రెస్ నేతలు సొంతపార్టీకి ద్రోహం చేశారని పార్టీ నాయకులు ఆరోపించారు. ఆగ్రో ఇండస్ట్రీ ఛైర్మన్ కాసుల బాలరాజ్, మాజీ డీసీసీ ఛైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి ఆదేశాల మేరకు పోతంగల్‌లో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. బాన్సువాడ మున్సిపాలిటీ ఎన్నికల నేపథ్యంలో కొంతమంది ఏనుగు రవీందర్ రెడ్డి వర్గానికి సంబంధించిన కాంగ్రెస్ నాయకులు బాన్సువాడలోని బీఆర్ఎస్, బీజేపీ నాయకులతో కుమ్మక్కయ్యారని వారు ఆరోపించారు. కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ గైక్వాడ్ హన్మంత్, మాజీ ఎంపీపీ గంధపు పవన్, మాజీ ఎంపీటీసీలు కేశ వీరేశం, విఠల్, సర్పంచులు శ్రీనివాసరావు, జగన్, షాజీ పటేల్, ఉపసర్పంచ్, నబి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నీరడి గంగాధర్, ఎజాజ్ ఖాన్, గంట్ల విఠల్ పాల్గొన్నారు.



## గుత్పలో సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ




**అక్షరటుడే, ఆర్మూర్:** ఆలూర్ మండలం గుత్ప గ్రామంలో ఇద్దరికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. గ్రామానికి చెందిన చెరుకు సాయితేజ, భామంకర్ విజయలక్ష్మిలు ఇటీవల తీవ్ర అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందారు. వారి పరిస్థితిని ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి పొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డి దృష్టికి స్థానిక నాయకులు తీసుకెళ్లారు. దీంతో ఆయన గురువారం చెరుకు సాయితేజ రూ.22,000కు, భామంకర్ విజయ్‌లక్ష్మికి రూ.30,000 చెక్కులను వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శశి కుమార్, సాయి రెడ్డి, నరేశ్, పోశన్న, సాయన్న, రాజేశ్వర్, గంగాధర్, రాజేష్, బొర్రన్న, సురేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ముప్కాల్ పడిలేచిన మర్రిచెట్టు దేవస్థానంలో కల్యాణ మహోత్సవాలు



**అక్షరటుడే, ముప్కాల్:** ముప్కాల్ పడిలేచిన మర్రిచెట్టు దేవస్థానంలో శివలింగేశ్వర స్వామి కల్యాణ మహోత్సవాలు నిర్వహించనున్నారు. ఈనెల 13వ తేదీ నుంచి 16వ తేదీ వరకు నాలుగు రోజుల పాటు ఉత్సవాలు జరుగనున్నాయని గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు కట్ట మహేష్ యాదవ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 15వ తేదీ ఆదివారం స్వామివారి కల్యాణం ఘనంగా జరుగుతుందని తెలిపారు. 16న భక్తుల సౌకర్యార్థం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఉత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని జాతరను విజయవంతం చేయాలని కమిటీ సభ్యులు కోరారు.

## తాళం వేసిన ఇంట్లో భారీగా బంగారం చోరీ



**అక్షరటుడే, కామారెడ్డి :** రాత్రి, పగలు తేడా లేకుండా దొంగలు రెచ్చిపోతున్నారు. శివారు కాలనీల్లో రెక్కీ నిర్వహించి చోరీలకు పాల్పడుతున్నారు. తాజాగా తాళం వేసిన ఇంట్లో చొరబడి 16 తులాల బంగారం, 3 తులాల వెండి, రూ.3 వేల నగదు ఎత్తుకెళ్లిన ఘటన కామారెడ్డి పట్టణంలోని బృందావన్ కాలనీలో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. బాధితుల కథనం ప్రకారం.. పాల్వంచ మండలం భవానిపేట ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్న శ్రీ రేఖ బుధవారం రాత్రి 8 గంటల ప్రాంతంలో ఇంటికి తాళం వేసి దేవునిపల్లి గ్రామంలో ఉంటున్న తల్లి వద్దకు వెళ్లింది. తిరిగి గురువారం ఉదయం 6 గంటలకు ఇంటికి వచ్చి చూడగా తలుపులు తెరిచి ఉండడంతో ఆందోళనకు గురైంది. ఇంటి లోపలికి వెళ్లి చూడగా దుస్తులు, వస్తువులు చిందరవందరగా పడి ఉండటం, బీరువా తెరిచి ఉండడంతో చోరీ జరిగినట్టు భావించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పట్టణ పోలీసులు, సీసీఎస్ పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. చుట్టుపక్కల ఉన్న సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

## అథర్వణ వేద పారాయణ మహా యజ్ఞం




**అక్షరటుడే, ఆర్మూర్:** మండలంలోని అంకాపూర్ వైదిక ధ్యాన యోగా ఆశ్రమంలో గురువారం అథర్వణ వేద పారాయణ మహాయజ్ఞం నిర్వహించారు. ఆశ్రమ వ్యవస్థాపకులు, వైదిక ప్రచారకులు శ్రీధరానంద భారతీ స్వామి నేతృత్వంలో కార్యక్రమం జరిగింది. యజ్ఞానంతరం శ్రీధరానంద భారతి స్వామి, వేద పునీతానంద భారతీ స్వామి సత్సంగం చేశారు. స్వామీజీలు ఆధ్యాత్మిక అమృత భాషణం చేస్తూ అన్ని మతాలు పుట్టక ముందే ఉన్న మొదటి గ్రంథమే వేదం అని వివరించారు. ఈ భారత దేశమే వేద భూమి అని, వేద ప్రచారం లేక కనీసం వేదాల పేర్లు కూడా తెలియని దుస్థితి నెలకొని ఉందని వారన్నారు. దీంతో కొత్తకొత్త మతాలు, సంప్రదాయాలు పుట్టుకొచ్చి మనుషులను దోపిడీ చేస్తున్నాయన్నారు. అందుకే మళ్లీ వైదిక విజ్ఞానాన్ని పంచేందుకు ఈ అథర్వ వేద పారాయణ యజ్ఞం మొదలుపెట్టామన్నారు. కార్యక్రమంలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.